www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 27 డిసెంబర్ 2025 | 5 | పశ్చిమ గోదావరి



రబీ సీజన్‌కు సరిపడా యూరియా ఉంది

జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం: జిల్లాలో రబీ సీజన్‌కు గాను అన్ని పంటలకు అవసరమైన 36,820 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 17న నవ పాలెం, కుంచనపల్లి రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్టును(ప్రయోగాత్మక ప్రాజెక్టు) శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ పైలెట్ ప్రాజెక్టు(ఎపిఐఎంఎస్)2.0 సాఫ్ట్‌వేర్ ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26వ తేదీ నుండి రాబోయే 21 రోజుల వరకు 59 59 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 9124 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. కౌలు రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఏ ఆర్.గంగాధర్, మండల వ్యవసాయాధికారి వి.నారాయణ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'చింతలపూడి' ఎత్తిపోయనట్టేనా..!

- ప్రభుత్వ మాటలకు. చేతలకు పొంతన కరువు
- జిల్లా సాగునీటి ప్రాజెక్టుల్లో చింతలపూడి ఎత్తిపోతల కీలకం
- 4.80 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ప్రాజెక్టు మూలకు
- సిఎం జిల్లాకు వచ్చిన ప్రతిసారీ చింతలపూడి పూర్తి చేస్తామని ప్రకటన
- ఏడాదిన్నర గడిచినా ఒక్క అడుగూ ముందుకు పడని పరిస్థితి
- గడిచిన ఎన్నికల్లో రైతులకు ఎంపీ, ఎంఎల్ఎల వాగ్దానాలన్నీ తూచ్
- రైతులకు ఇప్పటికీ తీరని పరిహారం సమస్య

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాకు అత్యంత ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టు చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని కూటమి సర్కార్ పూర్తిగా పక్కన పెట్టేసింది. జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతిసారీ చింతలపూడి ప్రాజెక్టు పూర్తి చేస్తామని సిఎం ప్రకటనలు గుప్పించడం మినహా ఒక్క అడుగూ ముందుకు పడిన పరిస్థితి లేదు. గడిచిన ఎన్నికల్లో చింతలపూడి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, మంత్రి కొలుసు పార్థసారధి, ఇతర ఎంఎల్‌ఎలంతా రైతులకు వాగ్దానాలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాదిన్నర గడిచినా చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ఒక్క అడుగూ ముందుకు పడిన దాఖలాల్లేవు. 2028కి చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడమే తప్ప అందుకు తగిన కార్యాచరణ ఏమాత్రం లేకుండాపోయింది. దీంతో మెట్ట ప్రాంత రైతుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఇప్పటికీ రైతులకు సంబంధించిన భూపరిహారం సమస్యను సైతం పరిష్కరించని పరిస్థితి ఉంది. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి దాదాపు 17 ఏళ్లు గడుస్తున్నా చుక్కనీరూ పారని దుస్థితి నెలకొంది. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోదావరి జలాలను మెట్ట ప్రాంతానికి తరలించాలన్న లక్ష్యంతో 2008లో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 15 మెట్టప్రాంత మండలాల్లో రెండున్నర లక్షల ఎకరాలకు సాగు, పలు గ్రామాలకు తాగునీరు ఇచ్చేవిధంగా రూ.1,701 కోట్లతో ఈ ప్రాజెక్టుకు ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించినా ముందుకు సాగలేదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 2014లో టిడిపి అధికారంలోకి వచ్చింది. చింతలపూడి ఎత్తిపోతల పథకం 2018 నాటికల్లా పూర్తి చేస్తామని ప్రకటించింది.



చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ

అంతేకాకుండా ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేసింది. కృష్ణా జిల్లాలోని పలు మండలాలకు చింతలపూడి ఎత్తిపోతల ద్వారా సాగునీరు సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో మొత్తం 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందించేలా మార్పులు జరిగాయి. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.4,909 కోట్లకు పెంచారు. కొంతమేర వేగంగా సాగినా ప్రాజెక్టు మాత్రం పూర్తి చేయలేదు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చింతలపూడి ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో మళ్లీ కథ మొదటికొచ్చింది. తాము అధికారంలోకి వస్తే చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని సిఎం చంద్రబాబు జిల్లా పర్యటనల్లో ప్రకటిస్తూనే ఉన్నారు. పనులు మాత్రం జరగడం లేదు. గడిచిన బడ్జెట్‌లో రూ.200 కోట్లు వరకూ కేటాయించిన పనులు మాత్రం ముందుకు సాగని పరిస్థితి. చింతలపూడి ప్రాజెక్టు నుంచి నీరు ఎత్తిపోయనట్లేనా అంటూ రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల పరిహారం సమస్య తీరేదెప్పుడో..!

తాము అధికారంలోకి వస్తే చింతలపూడి ప్రాజెక్టుకు భూమి ఇచ్చిన రైతులకు న్యాయం చేస్తామని 2019 ఎన్నికల ముందు చింతలపూడి సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆ పార్టీ అధ్యక్షుడి హోదాలో జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల గురించి పట్టించుకున్న పాపాన లేకుండా పోయింది. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరకు, ప్రభుత్వం ఇస్తానని ప్రకటించిన ధరకు సంబంధం లేదని రైతులు అప్పట్లో పెద్దఎత్తున నిరసనలకు దిగారు. కాల్వ తవ్వకాలను అడ్డుకున్నారు. కొంతమంది రైతులు కోర్టుకు వెళ్లారు. ఎకరా విలువ బహిరంగ మార్కెట్లో రూ.50 లక్షల వరకూ ఉండగా, ప్రభుత్వం రూ.19 లక్షలు ఇవ్వడంపై రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికీ రైతులకు సంబంధించిన పరిహారం సమస్యకు పరిష్కారం చూపని పరిస్థితి. ఇప్పటికైనా రైతులకు పరిహారం అందించి, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే వచ్చే ఎన్నికల్లో మెట్ట ప్రాంతంలో కూటమి సర్కార్‌కు ఎదురుదెబ్బ తప్పదని చెప్పొచ్చు.

'ఉపాధి హామీ' నిర్వీర్యమే లక్ష్యంగా కేంద్రం కుట్ర

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



నినదిస్తున్న ఉపాధి శ్రామికులు

ప్రజాశక్తి - ఉండి

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల్లో కోత విధించిందని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మండిపడ్డారు. శుక్రవారం ఉండి మండలం యండగండిలో ఉపాధి హామీ చట్టంలో మార్పులకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఉపాధి హామీలో గతంలో 90 శాతం ఉన్న కేంద్ర ప్రభుత్వ వాటాను 60 శాతానికి కుదించి పరోక్షంగా పేదల పొట్ట కొడుతుందన్నారు. ఇప్పటికే కేవలం 10 శాతం వాటా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ శ్రామికులకు వంద పని దినాలు చూపించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని, అలాంటిది 40 శాతం వాటా కేటాయిస్తే ఉపాధి హామీ పనులపై ఆశలు వదులుకోవాల్సిందేనన్నారు. గాంధీ అనే పేరు దేశంలో వినపడకూడదని మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పేరును కూడా మార్చడం దుర్మార్గమన్నారు. తక్షణం ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ధనికొండ శ్రీనివాస్, నేతలు కొట్టాడ వెంకటేశ్వరరావు, కిలారి తవిటి నాయుడు, వీరవల్లి త్రిమూర్తులు, సీతయ్య, విజయలక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన డిఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం నూతన డిఎస్‌పి రఘువీర్ విష్ణు కలెక్టర్ చదలవాడ నాగరాణిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిఎస్‌పికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ డివిజన్‌లో లా అండ్ ఆర్డర్ అమలు, ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోనున్న చర్యలపై వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక నెల రోజులపాటు పండుగ వాతావరణం ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలని, అన్ని విధాలుగా నిఘా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. లా అండ్ ఆర్డర్‌ను పటిష్టంగా అమలు చేసి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిఎస్‌పి

కేంద్ర మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

కలెక్టర్ సిహెచ్.నాగరాణి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - నరసాపురం

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పశ్చిమగోదావరి జిల్లా పర్యటన విజయవంతం చేయాలని కలెక్టర్ సిహెచ్.నాగరాణి అన్నారు. మండలంలోని పెదమైనవానిలంక గ్రామంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొంటారని కలెక్టర్ నాగరాణి అన్నారు. ఈనెల 28వ తేదీ ఆదివారం మండలంలోని పెదమైనవానిలంక గ్రామానికి మంత్రి పర్యటన దృష్ట్యా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ఆదివారం వివిధ అభివృద్ధి, సంక్షేమ, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనున్నారన్నారు. పెదమైనవానిలంక గ్రామంలో శివాలయం వద్ద జరుగుతున్న సముద్రపు కోత అడ్డుకట్ట పనులను పరిశీలిస్తారని, అనంతరం మన్‌కీ బాత్ కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. తదుపరి డిజిటల్ భవన్‌లో ఏర్పాటుచేసిన డ్రోన్, ఎఐ నైపుణ్య శిక్షణ తరగతులు ప్రారంభిస్తారన్నారు. వికసిత్ భారత్, డిజిటల్ ఇండియా ఉద్దేశంగా జిల్లాలోని వివిధ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పెయింటింగ్ పోటీలు, వందేమాతరం పాటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేస్తారన్నారు. అనంతరం డిజిటల్ భవన్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరై విద్యార్థులు, ప్రజలతో ముఖాముఖిలో పాల్గొంటారని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్ర మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. తొలుత రామకృష్ణ మిషన్ రాజమండ్రి సౌజన్యంతో తయారు చేస్తున్న మత్స్యకార బోట్లను, డిజిటల్ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభా వేదిక, సియోన్ట్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ డిజిటల్ భవన్లో ఏర్పాటుచేసిన ఎఐ పవర్ డ్రోన్ టెక్నాలజీ లాబ్, ఎఐ డిజిటల్ అండ్ ఐటీ లీటరసీ ల్యాబ్, ఎఐ పవర్ మార్కెటింగ్ అండ్ ఈ కామర్స్ స్కిల్స్ ల్యాబ్, మన్‌కీ బాత్ కార్యక్రమం, సముద్రపు కోత అడ్డుకట్ట పనులను కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఆర్‌డిఒ దాసిరాజు, సర్పంచి సెక్రటరీ మోహన్, డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, డిఎస్ఒ సరోజ, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఎల్‌డిఎం నాగేంద్రప్రసాద్, జిల్లా అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్‌వి.అరుణ్ కుమారి, ఐసిడిఎస్ పీడీ డి.లక్ష్మి, ఆర్‌అండ్‌బి ఎస్ఇ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఇంజినీర్ సత్యనారాయణ, మత్స్యశాఖ అధికారి ఎల్‌ఎల్‌ఎన్.రాజు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

అప్పలరాజును బేషరతుగా విడుదల చేయాలి

సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - గణపవరం

సిపిఎం అనకాపల్లి జిల్లా నేత, రైతుసంఘ నాయకులు ఎం.అప్పలరాజుపై ప్రభుత్వం పెట్టిన పీడీ యాక్టును వెంటనే తొలగించి బేషరతుగా విడుదల చేయాలని పశ్చిమగోదావరి జిల్లాలో శుక్రవారం నిరసనలు కొనసాగాయి. గణపవరం మార్కెట్ యార్డు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ ఎం.పెంటారావు, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వ్యక్తిపై పీడీ యాక్టు పెట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో బుద్దాల మణికంఠ, తోట అయ్యప్ప, రాము రామస్వామి, టి.కృష్ణస్వామి పాల్గొన్నారు.

వీరవాసరం: పీడీ యాక్టును ఉపసంహరించి అప్పలరాజును తక్షణమే విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. శుక్రవారం నవుడూరు సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, నేతలు బొర్రా అలమహారాజు,



గణపవరంలో..



ఆకివీడులో నినదిస్తున్న నేతలు

ఎం.ఆంజనేయులు, నారాయణమూర్తి, అయినంపూడి బాబూరావు, రాము, కిలాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ప్రజా ఉద్యమ నేత అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇటుకలకుంట గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి పాలుపూరి సత్యవతి మాట్లాడగా, మాగంటి వెంకటరమణ, మల్లిపూడి సీతామహాలక్ష్మి, పి.ధనలక్ష్మి, వెంకటలక్ష్మి, పి.పుష్ప, పాలపూరి వెంకటనాగమణి తదితరులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: అప్పలరాజును తక్షణమే విడుదల చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంప బస్టాండ్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కనుమూరి కృష్ణంరాజు, సుబ్బారావు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: సిపిఎం అనకాపల్లి జిల్లా నేత ఎం.అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పీడీ యాక్ట్ కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మార్టేరు సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రజల కోసం పని చేస్తున్న అప్పలరాజుపై చట్ట విరుద్ధంగా బనాయించిన అక్రమ పీడీ చట్టం కేసును ఉపసంహరించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు పి.మోహన్‌రావు, షేక్ పాదుషా, సూర్నీడి వెంకటేశ్వరరావు, బండి రంగారావు, పిల్లి ప్రసాద్, బొంతు శ్రీను, తలుపూరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, తోటపల్లి సత్యనారాయణ, మూడే మోజెస్, మంగం సూర్యనారాయణ, బ్రహ్మాజీ హనుమంతరావు, వరహాలురెడ్డి, రామారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆకివీడు: రైతుసంఘం అనకాపల్లి జిల్లా నాయకుడు అప్పలరాజు అరెస్ట్ పూర్తి అక్రమమని, తక్షణం ఆయనను విడుదల చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో పెంకి అప్పారావు, షేక్ వలీ, డోకల రవి, బొడ్డుపల్లి రాంబాబు, సందక సూరిబాబు, బి.మల్లేష్, ఎం.ఆదినారాయణ, ఎం.సత్యం, ఎస్.శ్రీను, ఎన్.రమేష్, కె.శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.




పెనుమంట్ర మండలం మార్టేరులో నిరసన

దొక్కా సీతమ్మ అక్షయ పాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రతి ఒక్కరూ ఆహార పదార్థాలను వృధా చేయడం మానుకోవాలని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. వీరవాసరం సామాజిక సేవకుడు, అన్నదాత మళ్ల తులసీరాంబాబు చేపట్టిన డొక్కా సీతమ్మ అక్షయపాత్ర కార్యక్రమాన్ని ఎంఎల్ఎ శుక్రవారం ప్రారంభించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ వివాహాది శుభకార్యక్రమాల్లో, ఇతర కార్యక్రమాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాల సమాచారాన్ని అక్షయ పాత్ర నిర్వాహకులకు తెలియజేస్తే వారు వచ్చి ఈ మిగిలిన ఆహార పదార్థాలను తీసుకెళ్లి నిరుపేదలకు అందజేయడం జరుగుతుందని అంజిబాబు అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. తులసీ రాంబాబు మాట్లాడుతూ ఎవరైనా తమకు సమాచారం ఇవ్వాలనుకుంటే 9888937775, 8142313005 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. వీరవాసరం, భీమవరం, అత్తిలి, మార్టేరు, పాలకొల్లు, నరసాపురం పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ కార్యక్రమం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, ఎపి మహిళ సహకార ఆర్థిక కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ పీతల సుజాత, సర్పంచి చికిలే మంగతాయారు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, కోళ్ల నాగేశ్వరావు, టిడిపి మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, మళ్ల శ్రీరామమూర్తి పాల్గొన్నారు.



అక్షయపాత్ర వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

మట్టిలో మాణిక్యం మైలా నాగయ్యవర్మ

సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మట్టిలో మాణిక్యం మైలా నాగయ్యవర్మ అని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. భూపోరాట యోధుడు, అమర వీరుడు, సిపిఎం నాయకుడు, వ్యవసాయ కార్మికోద్యమ ముద్దుబిడ్డ మైలా నాగయ్యవర్మ 54వ వర్ధంతి స్థానిక సుందరయ్య భవనం వద్ద శుక్రవారం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ పూలమాల వేసి ఘనంగా నివాళులు, జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ మైలా నాగయ్య వర్మ తోకతిప్ప గ్రామంలో ఒక సామాన్యమైన కుటుంబంలో జన్మించి, చిన్ననాటి నుండే దేశభక్తి భావాల్ని, సామాన్య, పీడిత ప్రజలపట్ల, పేదల పట్ల అనురాగాన్ని పెంచుకున్నారన్నారు. పేద ప్రజల సమస్యలు పరిష్కారం కావాలి, పీడిత ప్రజలు దోపిడీ నుండి విముక్తి కావాలి, పేద ప్రజలకు, అట్టడుగు వర్గాలకు భూమి దక్కాలి అని పోరాడిన యోధుడు మైలా నాగయ్యవర్మ అన్నారు. తాను నమ్ముకున్న ఆశయానికి, సిద్ధాంతానికి అంకితమై తన ఉద్యోగాన్ని వదులుకొని, కుటుంబ సభ్యుల సహకారంతో పీడిత ప్రజల ఉద్యమానికి అంకితమైయ్యారన్నారు. తోకతిప్ప, కొత్తపూసలమర్రు, గంజాయి సొసైటీ, గరవల్ల దిబ్బ, దొంగపిండి, కలవపూడి ప్రాంతాల్లో ఉన్నటువంటి వేలాది ఎకరాల బంజరభూములు పెత్తందార్లు, భూస్వాములు అనుభవిస్తుంటే అవి భూస్వాముల సొత్తుకాదు పేదలకు దక్కాలని, పేదలకు దక్కితే వారు కుటుంబాల్లో వెలుగు నింపవచ్చు అని భూపోరాటనికి నాంది పలికి, ఉద్యమానికి తానే స్వయంగా నాయకత్వం వహించారన్నారు. ఈ పోరాటం ఫలితంగా అనేక పేద కుటుంబాలకు భూమి దక్కిందన్నారు. కలవపూడి గూండాలు ఇది ఓర్వలేక చర్చలకు అని పిలిచి దారి కాచి కాల్చి చంపారని సీతారాం అన్నారు. ఒక ఉద్యమ కారున్ని చంపారు కానీ ఉద్యమాన్ని చంపలేరన్నారు. ఆయన మరణానంతరం పార్టీ ఉద్యమం నడిపింది, పేదలకు భూమి దక్కేలా చేసిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన ఆశయాల బాటలో నడుస్తామని అన్నారు. జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ దేశంలో ప్రజల జీవితాల్లో వెలుగు తీసుకురావడం కోసం కమ్యూనిస్టులు మాత్రమే ప్రాణత్యాగాలు చేశారని, అటువంటి త్యాగం చేసినవారిలో ఒకరు మైలా నాగయ్యవర్మ అన్నారు. పేదలకు భూమి దక్కాలని పోరాడేది సిపిఎం అన్నారు. మిగలిన రాజకీయపార్టీలన్నీ వారు ఇచ్చే అరకొర పథకాలపై ప్రజలు ఆధారపడేటట్లు చేస్తున్నాయన్నారు. ఇది ఓటు బ్యాంకు రాజకీయం తప్ప దీనిలో ప్రజల అభివృద్ధి గాని, శ్రేయుస్సు గాని లేదన్నారు. ఇది ప్రజానీకం గమనించాలని గోపాలన్ తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా నాయకులు కె.రాయ్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రామాంజనేయులు, పట్టణ కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, వడుగు వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగయ్యవర్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీతారాం, నేతలు

మారియ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

19వ వర్ధంతి కార్యక్రమంలో నేతలు



నివాళులర్పించి నినదిస్తున్న నేతలు

ప్రజాశక్తి - వీరవాసరం

కల్లుగీత కార్మిక సంఘం నేత, సిపిఎం నేత జుత్తిగ మారియ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. మారియ్య 19వ వర్ధంతి కార్యక్రమంలో శుక్రవారం బుధారాయుడు చెరువులోని స్మారక స్తూపం వద్ద సిపిఎం మండల కార్యదర్శి అలమహారాజు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత స్తూపం వద్ద సిపిఎం పతాకాన్ని గోపాలన్ ఎగురవేశారు. మారియ్య చిత్రపటానికి జ్యోతిబసు, బాబూరావు, లింగం సత్యనారాయణ, కిలాడి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ అమరజీవుల త్యాగాలను స్మరించుకుని ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం సామాన్య మానవునికి గుదిబండలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారంలో మారియ్య ఎనలేని కృషి చేశారన్నారు. వాటితోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం తపించేవారన్నారు. కార్యక్రమంలో నేతలు యండమూరి సుబ్బారావు, తాళ్లూరు రాము, శ్యాంబాబు, యాళ్లబండి నారాయణమూర్తి, జుత్తిగ సాంబాయమ్మ, సూర్యనారాయణ, మారినాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ చెరువు చుట్టూ కంచె నిర్మించాలి

సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యాన పంచాయతీ సిబ్బందికి వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ పంచాయతీ చెరువు చుట్టూ పార్క్ ఉండటంతో చెరువు చుట్టూ కంచె నిర్మాణం చేపట్టాలని సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యాన పంచాయతీ సిబ్బంది భార్గవ్‌నాయుడుకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి షేక్ భాషేక్ పాదుషా మాట్లాడుతూ జొన్నల ధనరాజు కుమారుడు ఈశ్వర్(5) ఈనెల 25వ తేదీన గ్రామ పంచాయతీకి చెందిన పార్క్ చెరువులో జారి పడి దుర్మరణం పాలయ్యాడన్నారు. పిల్లలు తరచుగా ఆడుకోవడానికి పార్కుకు వస్తుంటారని, చెరువు చుట్టూ పార్కు ఉండటంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సేఫ్టీ ఫెన్సింగ్, ప్రమాద హెచ్చరిక బోర్డులు, సరైన జాగ్రత్తలు లేకపోవడం వల్ల ఈ హృదయవిదారక ఘటన జరిగిందన్నారు. సిపిఎం గ్రామ కమిటీ ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాలుడి కుటుంబానికి సంతాపం తెలిపింది. శుక్రవారం సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యాన గ్రామ పంచాయతీ నిర్లక్ష్యం వల్లే ఈ మరణం సంభవించిందని ఆరోపిస్తూ, ఇకపై ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువు చుట్టూ బలమైన ఫెన్సింగ్ లేదా బారియర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు(తెలుగులో, ఇంగ్లీష్‌లో) స్పష్టంగా పెట్టడం, పార్క్ ప్రాంతంలో పిల్లలు ఆడుకునే సమయాల్లో సూపర్‌వైజర్ లేదా వాచ్‌మెన్ నియమించడం మంచిదన్నారు. గ్రామస్థులకు ముఖ్యంగా తల్లిదండ్రులకు పిల్లల జాగ్రత్తలపై అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించడం, చెరువు అంచుల వద్ద జారుడు నిరోధక చర్యలు(స్లోప్ సరిచేయడం, గ్రావెల్ వేయడం) తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ ఈ బాధ్యతను తక్షణం నిర్వహించి, పిల్లల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సిపిఎం గ్రామ శాఖ డిమాండ్ చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, గుడిమెట్ల వరహాలరెడ్డి, బెల్లంకొండ భద్రరావు పాల్గొన్నారు.



వినతిని అందజేస్తున్న సిపిఎం నేతలు

విలేకరి సుబ్బరాజు మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

చాలా కాలం పెనుమంట్ర ప్రజాశక్తి విలేకరిగా పనిచేసి, ప్రస్తుతం వజ్రభారతి పత్రికలో విధులు నిర్వహిస్తున్న నాగరాజు సుబ్బరాజు(48) శుక్రవారం తెల్లవారుజామున ఆయన స్వగ్రామం వీరవాసరం మండలంలోని కొణితివాడలో మృతిచెందారు. ఆయనకు తల్లిదండ్రులు, ఒక అక్క, ఒక చెల్లి ఉన్నారు. సుబ్బరాజు అవివాహితులు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. పలువురు ఆయన ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.


సుబ్బరాజు(ఫైల్ ఫోటో)

95 శాతం నారుమడులు పూర్తి

మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో 95 శాతం నారుమడులు పూర్తి చేసినట్లు మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు అన్నారు. ఆచంట, పెనుమంచిలి గ్రామాల్లో శుక్రవారం ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 95 శాతం నారుమడులు పూర్తి చేసుకోవడం జరిగిందని, మిగిలిన ఐదు శాతం డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అన్నారు. మండలంలోని సొసైటీలలో 85 టన్నుల యూరియా, ఆదివేలంగా ప్రయివేటు డీలర్ల వద్ద 174 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు మోతాదుకు మించి యూరియా వినియోగించడం వల్ల దిగుబడిలో ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని, తప్పనిసరిగా రైతులందరూ మోతాదు ప్రకారమే ఎరువులు వినియోగించుకోవాలని తెలిపారు.

ఒంటరి మహిళలకు ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - పాలకొల్లు

యలమంచిలి మండలం నేరేడుమిల్లికి గ్రామానికి చెందిన వత్సవాయి కుమారి మెదడు, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుందని తెలుసుకున్న డాక్టర్ కోసూరి రామకృష్ణ ఆనంద రాజు రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు అధ్యక్షులు ఆర్థిక చేయూత అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు సామాజిక సేవలో ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిడుగు శ్రీనివాస్, (టీఆర్ఎంఏ మున్సిపల్ తెలుగు ఉపాధ్యాయుడు), జెడిఎస్ఐవిఆర్ఎం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులుగా రాంబాబు

ప్రజాశక్తి - గణపవరం

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులుగా జల్లికొమ్మర గ్రామానికి చెందిన కవల కోదండ రాంబాబు ఎన్నికైనట్లు శుక్రవారం రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తనని పార్టీ ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసినందుకు పార్టీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల వద్దకు వెళ్లే విధంగా కృషి చేస్తాని తెలిపారు.

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీనివాస రెడ్డి

ప్రజాశక్తి - పెనుమంట్ర


టిడిపి మండల అధ్యక్షునిగా 25 సంవత్సరాలు సేవలు అందించిన మార్టేరుకు చెందిన తమనంపూడి శ్రీనివాస రెడ్డి (బుజ్జి) ను టిడిపి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ఇక్కడ మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాల కాలం పాటు పార్టీకి తాను చేసిన సేవలకు గుర్తింపుగా పార్టీలో ఉపాధ్యక్ష పదవి లభించడానికి సహకారం అందించిన మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని అన్నారు. కాగా తమనంపూడికి లభించిన ఈ పదవి పట్ల టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు వెలగల బలి రామిరెడ్డి, గూడూరి మురళీ మోహన్, క్లస్టర్ ఇన్‌చార్జులు చింతపల్లి రామకృష్ణ, కర్రి అప్పారావు రామారెడ్డి, పలు గ్రామాల్లోని పార్టీ ప్రతినిధులు వారికి అభినందనలు తెలిపారు.



స్వచ్ఛాంధ్ర నిధులు ఉపయోగించుకోవాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు స్వచ్ఛ ఆంధ్ర నిధులను ఉపయోగించుకోవాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులతో మంజూరైన ఆయిదు ట్రాక్టర్ ట్రక్కులను స్థానిక మండలపరిషత్ భవనం ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య శుభ్రతకు స్వచ్ఛ ఆంధ్ర నిధులు గ్రామ సర్పంచులు ఉపయోగించుకోవాలన్నారు. మండలంలో అర్ధవరం, మొయ్యేరు, సరిపల్లి, జల్లికొమ్మర, కేశవరం గ్రామాలకు రూ.45,89,305తో మంజూరైన ట్రాక్టర్లను ధర్మరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ, డ్రైనేజీల శుభ్రతకు సమర్థవంతంగా నిర్వహించుకోవచ్చునని చెప్పారు. ప్రభుత్వం కూడా గ్రామాలాభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. అనంతరం మండలపరిషత్ భవనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధర్మరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ఎంఎల్ఎకు వినతిని అందజేస్తున్న గ్రామస్తులు

ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని వారతిప్ప గ్రామానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ విప్, ఎంఎల్ఎ నాయకర్‌కు వినతి పత్రం అందించామని గ్రామానికి చెందిన నాయకుడు కొల్లాటి బాబూరావు శుక్రవారం తెలిపారు. గ్రామంలోని పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులను గురవుతున్నారని, ప్రజలు ప్రయివేట్ వాహనాలకు అధిక రుసుములు చెల్లించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారతిప్ప గ్రామానికి ఉదయం, సాయంత్రం ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ నాయకర్‌కు వినతిపత్రం అందించామన్నారు. మాజీ సర్పంచి తిరుమాని తాతయ్య, దొంగ సత్యనారాయణ, తిరుమాని వెంకటేశ్వర్రావు, దొంగ శ్రీను, బర్రె నాగరాజు, పెదసింగు శ్రీను, వీరవల్లి ముత్యాలరావు, కడలి నాగేశ్వరరావు, పోతబత్తుల యేసు, తిరుమాని శ్రీను, సరదడి బాలాజీ, తిరుమాని కోటేశ్వరరావు, దొంగ యేసుబాబు, పలువురు గ్రామస్తులు వినతి పత్రం అందించిన వారిలో ఉన్నారు.

టిడిపి గ్రీవెన్స్

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యాన ప్రజాదర్బార్-ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను సంబంధించిన అర్జీలను సమర్పించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ స్వయంగా పరిశీలించి, అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అనేక సమస్యలకు తక్షణ పరిష్కారం అందించారు. తక్షణ పరిష్కారం సాధ్యం కాని సమస్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు ఆకన చంద్రశేఖర్, మొగల్తూరు సొసైటీ అధ్యక్షులు నిప్పులేటి తారక రామారావు, ఎఎంసి వైస్ చైర్మన్ దేశిరెడ్డి గంగాధర్ పాల్గొన్నారు.

పట్టణ టిడిపి కార్యాలయంలో నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్య కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు సమస్యలు విని అర్జీలు స్వీకరించారు. ఎఎంసి చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, మహిళ కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, సంకు భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సిఐ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కలెక్టర్, ఎస్‌పి ఆదేశాలతో భీమవరం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై గత కొన్ని రోజులుగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని, దీనిలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ట్రాఫిక్ సిఐ వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రధాన రహదారుల వెంబడి రోడ్డు పక్కన ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా వాహనాలు నిలుపడం చేస్తే టోయింగ్ వెహికల్ ద్వారా స్టేషన్‌కు తీసుకెళ్లడం జరుగుతుందని, దీనికి అదనంగా రుసుమును రూ.1000 విధించడం జరుగుతుందన్నారు. వాహనాలను ట్రో చేసే సందర్భంలో వాహనాలకు గీతలు పడే అవకాశం ఉంటుందని, వాహన యజమానులు ముందుగానే గమనించి రాంగ్ పార్కింగ్ చేయవద్దని సూచించారు. అలాగే హెల్మెట్ ధరించకపోతే రూ.1000 అపరాధ రుసుము విధించడం జరుగుతుందన్నారు. ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ రైడింగ్, మైనర్స్ రైడింగ్, వాహన లైసెన్సు లేకుండా రైడింగ్ చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, అపరాధ రుసుము తప్పక చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు.

నాగయ్య వర్మ ఆశయ సాధనకు కృషిచేయాలి

సిపిఎం నాయకులు రేవు రామకృష్ణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా రైతు కార్మిక వ్యతిరేక విధానాలు ప్రజలందరూ వ్యతిరేకించినప్పుడే మైలా నాగయ్య వర్మకు నివాళులర్పించినట్లని సిపిఎం నాయకులు రేవు రామకృష్ణ అన్నారు. భీమవరం రూరల్ కొత్త పూసలమర్రు, తోక తిప్ప గ్రామాల్లో భూ పోరాట యోధుడు మైలా నాగయ్య వర్మ విగ్రహానికి వర్థంతి సందర్భంగా ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పిపిపి పద్ధతిలో మెడికల్ కాలేజ్ ప్రయివేటుపరం చేస్తూ పేదలకు విద్యను దూరం చేస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని తూట్లు పొడిచే విధంగా పేరును మార్చటం, అక్రమంగా అనకాపల్లిలో రైతు సంఘం నాయకులు అప్పలరాజును అరెస్టు చేయడం, కార్మిక ఎనిమిది గంటల పని దినాన్ని 10 నుంచి 13 గంటల పెంచే విధంగా నిర్ణయాలు చేయటం జరుగుతుందన్నారు. ఈ విధానాలను ప్రజలు ప్రశ్నించి, వ్యతిరేకించినప్పుడే మైల నాగయ్యవర్మకి నివాళులర్పించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్, బొడ్డు లక్ష్మీపతి, తిరుమణి నాగేశ్వరావు, కనుమూరి కృష్ణంరాజు, తోట శుభకరం, కిరణ్, కొల్లాటి సుబ్బారావు, పొన్నమండ నాగేశ్వరావు, తిరుమణి సూర్యనారాయణ పాల్గొన్నారు.


ఫ్రూట్స్ అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కమలాలు పంపిణీ

కాళ్ల: క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఆరు ప్రార్థనా మందిరాలకు వండవల్లి దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు శుక్రవారం పంపిణీ చేశారు. కాళ్లకూరు గ్రామంలో పాతపేట సిబిసిఎన్‌సి చర్చికి 300 ఫ్రూట్స్, కొత్త కాలనీకి చెందిన గంటా ఏలియా చర్చికి 200 ఫ్రూట్స్ అందజేశారు. కొత్త కాలనీకి చెందిన సిబిసిఎన్‌సి చర్చికి 300 ఫ్రూట్స్, పాతపేటకు చెందిన ఆర్‌సిఎం చర్చికి 200 ఫ్రూట్స్, కొత్త డాక్టర్ అప్పారావు చర్చికి 100 ఫ్రూట్స్ అందజేశారు. ఏలూరుపాడు ఆర్‌సిఎం గుంపు షాలేము ప్రార్థన మందిరం కి 200 ఫ్రూట్స్ ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు.


శ్రీనివాస్, అబ్రహంలను సత్కరిస్తున్న జనసైనికులు


శ్రీనివాస్, అబ్రహంకు అభినందన

ఉండి: టిడిపి జిల్లా అధికార ప్రతినిధి వనిమా శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఉండ్ర అబ్రహంలకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగరాజు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తమ వంతు కృషిచేసిన వనిమా శ్రీనివాస్, దళిత నాయకులు ఉండ్ర అబ్రహంలకు టిడిపి అధిష్టానం తగిన పదవి ఇచ్చి గౌరవించిందని అన్నారు. అంకితభావంతో, పార్టీ పట్ల విధేయతతో పని చేసే పదవులు వాటంతట అవే వస్తాయి అనడానికి వనిమా శ్రీనివాస్, ఉండ్ర అబ్రహంలు ఉదాహరణని, ప్రతి ఒక్కరూ పార్టీలో కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ యడవల్లి వెంకటేశ్వరరావు, ఆకివీడు ఎఎంసి వైస్ చైర్మన్ గవరలక్ష్మి, నాయకులు గొట్టుముక్కల సుబ్బరాజు, పోలిశెట్టి బ్రహ్మానందం, కేసన సాయిరాం, కంకనాల బాలకృష్ణ, ఆరేపల్లి వెంకటేష్ ఉన్నారు.

శ్రీలక్ష్మి సేవలు ఎనలేనివి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గణపవరం

పంచాయతీ రాజ్ శాఖలో నిశ్వార్థంగా పనిచేసి ప్రజల మన్ననలను పొందిన ఎంపిడిఒ శ్రీలక్ష్మి సేవలు మరువలేనివని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ భవనంలో జరిగిన సన్మాన సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్న శ్రీలక్ష్మి తన ఉద్యోగ కాలంలో మండల పరిషత్ అభివృద్ధికి ఎనలేని సేవలందించారని అన్నారు. అనంతరం ఎంపిడిఒ దంపతులను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. మండలపరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు మాట్లాడుతూ మండలాభివృద్ధికి శ్రీలక్ష్మి తనదైన శైలిలో కృషిచేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ అధికారులు, సిబ్బంది, మండలంలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని శ్రీలక్ష్మి దంపతులను పూలమాలలతో సత్కరించారు.


ఎంపిడిఒ దంపతులను సన్మానిస్తున్న ఎంఎల్ఎ

అక్రమ రిజిస్ట్రేషన్లకు తావులేదు

ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ వీరవల్లి సురేష్

ప్రజాశక్తి - ఉండి

ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లకు తావు లేదని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వీరవల్లి సురేష్ అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం చిన్న గొల్లపాలెం గ్రామానికి చెందిన ఏలూరి రంగబాబు అనే వ్యక్తి కుటుంబానికి సంబంధించిన 36 ఎకరాల భూమి బంటుమిల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉందన్నారు. గత ఏడు నెలల నుంచి ఏలూరి రంగబాబు ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉంటూ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ జరుగుతుందంటూ అపోహలకు గురవుతున్నారని, ఆయన అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయన కుటుంబానికి సంబంధించిన ఆస్తులు వేరే వారి పేరిట రిజిస్ట్రేషన్ కావని ఆయన తెలిపారు. గత సబ్ రిజిస్ట్రార్ సమయంలో ఒక వ్యక్తికి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను చూపిస్తూ రంగబాబు ఏడు నెలల నుంచి ఇక్కడే ఉంటూ కార్యాలయానికి వచ్చే కక్షిదారులకు ఇబ్బందిగా మారారని, రంగబాబుకు ఆయన కుటుంబానికి సంబంధించిన ఆస్తులు కృష్ణా జిల్లా కోర్టు పరిధిలో నిషేధిత భూముల జాబితాలో ఉన్నాయన్నారు. ఆ భూములను రిజిస్ట్రేషన్ చేయడం జరగదని సురేష్ వివరించారు. ఏలూరి రంగబాబుకు, అతని కుటుంబ సభ్యులకు సంబంధించిన సర్వే నంబర్లు 478, 479, 480, 481, 483, 435/1, 416, 417/3, 419/2, 431/1, 463/1ఏ, 455/2, 454/2, 504, 395/1, 422/1, 500, 417/4లలో ఇప్పటి వరకు ఎటువంటి రిజిస్ట్రేషన్ వ్యవహారం జరగలేదని రంగబాబుకు ఎన్ని సార్లు వివరించినా అతను వినడం లేదని అన్నారు. రంగబాబు పైన ఉదహరించిన సర్వే నంబర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తన కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరగదని పత్రికా ముఖంగా రంగబాబుకు హామీ ఇస్తున్నట్లు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వీరవల్లి సురేష్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఆదిత్య విద్యార్థులకు ర్యాంకులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గత నెల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి లిటిల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు ఫస్ట్, సెకండ్, సెవెంత్ ర్యాంకులతో పాటు 17 ,19 ర్యాంకులు కూడా సాధించారని స్కూల్ కరస్పాండెంట్ అండ్ డైరెక్టర్ డాక్టర్ లయన్ కృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్కూల్లో విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. తమ విద్యార్థులు అద్భుతంగా రాణించడానికి స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, యుగసుధ, సత్యనారాయణ, దుర్గయ్య పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న హెచ్ఎం

రైతుల అభివృద్ధికి కృషి

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు

ప్రజాశక్తి - ఉండి

రైతులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి బలోపేతం చేయడంలో ప్రభుత్వం చేస్తున్న కృషి ఎనలేనిదని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తిగ నాగరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఉండి అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో డిసిఎంఎస్ ఆధ్వర్యాన నూతనంగా ప్రారంభించిన ఎరువులు, పురుగుమందుల విక్రయ కేంద్రం ప్రారంభోత్సవంలో వారు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, యూరియా, వరి విత్తనాలు, కాంప్లెక్స్ ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రంలో అధిక రేట్లు కంటే అతి తక్కువ ధరకే అన్ని కేంద్రంలో లభిస్తాయని, రైతులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిసిఎంఎస్ ద్వారా ప్రజలకు అవసరమైన జనరిక్ మందులు, సూపర్ మార్కెట్, దీపావళి మందుల దుకాణం వంటివి ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. త్వరలోనే ఆకివీడులో డిసిఎంఎస్ ఎరువులు, పురుగుమందుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని వారు తెలిపారు. డిసిఎంఎస్ ఆధ్వర్యాన 24వ బ్రాంచిను ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎఎంసి చైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, వైస్ చైర్మన్ యడవల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువుల బస్తా విక్రయాలను జరిపారు. అనంతరం ఉండి, గణపవరం రహదారిలో నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించి సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ చినమిల్లి చంద్రశేఖర్, డిసి చైర్మన్ తోట ఫణి, వైస్ చైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, టిడిపి మండల అధ్యక్షులు కమ్మిలి కోదండ నాగరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ అంజయ్య బదిలీ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. అంజయ్యను అనంతపురం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అంజయ్య బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్.వెంకట రామి రెడ్డిని నరసాపురం కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో నూజివీడు కమిషనర్‌గా పనిచేశారు. మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అంజయ్య తీరుపై మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట రమణ మున్సిపల్ డైరెక్టర్, కమిషనర్ కూడా ఫిర్యాదు చేశారు. డంపింగ్ యార్డ్ వ్యవహారంలో ఎంఎల్ఎ నాయకర్ సైతం సెలవు పెట్టి వెళ్లిపోవాలని సైతం హెచ్చరించారు.

రంగా ఆశయాలు సాధిద్దాం

పలుచోట్ల వర్థంతి సందర్భంగా ఘన నివాళి


ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేద ప్రజలకు అండగా నిలిచిన ఆదర్శ నేత వంగవీటి మోహన రంగా ఆశయాలను సాధించాలని విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శ్రీదేవిటాకీస్ సెంటర్ వంగవీటి మోహన రంగా 37 వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక గొల్లగూడెం సెంటర్, పోలీస్ ఐలాండ్ సెంటర్లలో ఉన్న వంగవీటి మోహన రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా ఏ కులానికో, మతానికో చెందిన వ్యక్తి కాదని, ఆయన ఒక మహాశక్తి అని, తన వద్దకు సహాయం కోసం వచ్చిన వారి కులం, మతం, ప్రాంతం ఏమీ చూడకుండా తక్షణమే వారి సమస్యను పరిష్కరించిన పేద ప్రజలకు పెన్నిధిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో బిజెపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ, జెడిపిటిసి ముత్యాల ఆంజనేయులు, మాకా శ్రీనివాస్, జన సైనికులు వంగవీటి మోహన్ రంగా అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం : మాట్లాడుతున్న ఎంఎల్ఎ

తణుకు రోడ్డులోని రంగా విగ్రహం వద్ద టిడిపి ఇన్‌చార్జి వలవల బాబ్జీ, రంగా రాధా మిత్రమండలి మెరుగు రాజగోపాల్, కర్రి సత్యనారాయణ ఆధ్వర్యాన వంగవీటి మోహన రంగా 37వ వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టిడిపి నాయకులు పట్నాల రాంపండు, దాట్ల జగన్నాథ రాజు, సీనియర్ నాయకులు పద్మనాభం మురళీ, గురజు సూరిబాబు, జవ్వులపాటి యూత్, పాతూరు యూత్, నిమ్మల యూత్ సభ్యులు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తణుకు : బడుగు, బలహీన తరగతుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ ఎవరికి ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ ముందు వరుసలో ఉండే తత్వం వంగవీటి మోహనరంగాదని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం వంగవీటి మోహనరంగా వర్ధంతి పురస్కరించుకుని మండలంలోని పైడిపర్రులో నూతనంగా ఏర్పాటుచేసిన రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ.. చిన్నపాటి పనులు కూడా ఆయన కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి రవీంద్రనాథ్, కాపు సంఘం రాష్ట్ర నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తణుకులో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎలు

కాళ్ల : పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి వంగవీటి మోహన రంగా అని పలువురు నాయకులు మాట్లాడారు. మండలంలోని కాళ్ల, ఏలూరుపాడు, దొడ్డనపూడి, సీసలి గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఎంసి సభ్యులు చిన్నా పరపు రాంబాబు, టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి వక్కపట్ల హరిబాబు మాట్లాడుతూ బడుగు బలహీన తరగతుల అభ్యున్నతికి రంగా ఎనలేని కృషి చేశారని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. టిడిపి, వైసిపి పాల్గొన్నారు.

వీరవాసరం : వంగవీటి మోహనరంగా 37వ వర్థంతి శుక్రవారం వీరవాసరంలో నిర్వహించారు. వీరవాసరం తూర్పు చెరువు సెంటర్లో రంగా విగ్రహానికి గుండా రామకృష్ణ, నూకల సర్పంచి వీరవల్లి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరవల్లి రామకృష్ణ మాట్లాడుతూ రంగా ఆశయ సాధనకు బడుగు బలహీన తరగతుల ప్రజా సమస్యలపై పోరాటం చేయడమేనని అవసరం ఉందన్నారు. గుండా రామకృష్ణ మాట్లాడుతూ రంగా తెలుగు ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. రంగా కులాలకు, రాజకీయాలకు అతీతంగా వాడుకుంటున్నారని, ఏ పదవి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాపు వనిత క్లబ్ సభ్యులు డాక్టర్ బి.లక్ష్మి కళ్యాణి, కుంచె వేణు, తిర్రంశెట్టి నాగమణి, జద్దు పద్మయ్య, కంచర్ల తమ్మి, సవరం రామకృష్ణ, యర్రంశెట్టి శీనయ్య, కామిశెట్టి సాయిబాబు, గుండా వెంకటరమణ, గుండా సూర్యనారాయణ, మద్దాల రాంబాబు పాల్గొన్నారు.

గణపవరం : బడుగు బలహీన తరగతుల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా అని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం రంగా వర్థంతి సందర్భంగా పిప్పరలో వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పిప్పర గ్రామంలో జరిగిన మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

నరసాపురం : ప్రజానాయకుడు, కీర్తిశేషులు వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా పట్టణంలోని 7వ వార్డులోని విగ్రహానికి విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా పేద ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, వాతాడి కనకరాజు, నిప్పులేటి తారక రామారావు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో వంగవీటి మోహన రంగా వర్ధంతిని అభిమానులు ఘనంగా నిర్వహించారు. కాళీపట్నం తూర్పులో సర్పంచి మేడిది సౌజన్య ప్రభాకర్ ఆధ్వర్యాన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేరేపాలెం, కొత్తపాలెం, మొగల్తూరు, ముత్యాలపల్లి, పేరుపాలెం, కెపి పాలెం తదితర గ్రామాల్లో రంగా వర్ధంతి ఘనంగా నిర్వహించారు.

క్రిస్మస్ వేడుకల్లో విషాదం

విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారామపురం సౌత్ గ్రామంలో శుక్రవారం విషాదం చోటుచేసుకుంది. క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లలో భాగంగా గ్రామంలోని మైక్ సెట్ కడుతూ జెట్టిపాలెం గ్రామానికి చెందిన శీలం అభిరామ్(19) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మరణించాడు. చెట్టుపై మైక్ అమర్చుతుండగా సమీపంలోని 11 కెవి విద్యుత్ తీగలు తగలడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అభిరామ్ స్వగ్రామం పాలకొల్లు మండలం పెదమామిడిపల్లి. వీరి తల్లిదండ్రులు జీవనోపాధి కోసం గల్ఫ్‌లో పనిచేస్తున్నారు. అభిరామ్ వాళ్ల అమ్మమ్మ ఇంటి వద్ద జెట్టి పాలెంలో ఉంటున్నాడు. నరసాపురంలోని ఓ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. ఖాళీ సమయంలో లైటింగ్ పనికి వెళ్తాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు సీతారామపురం సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. విద్యుత్ శాఖ నరసాపురం రూరల్ ఎఇ కె. సుధాకర్, మొగల్తూరు ఎస్‌ఐలు జి.వాసు, వై.నాగలక్ష్మి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం నుండి నష్ట పరిహారం వచ్చేలా చూస్తామని అధికారులు తెలియజేయడంతో కుటుంబ సభ్యులు శాంతించారు.


అభిరామ్(ఫైల్)

అన్ని సొసైటీల్లో ఎరువుల నిల్వలు

మండల వ్యవసాయాధికారి బి.దేవీ స్వరూప

పెనుమంట్ర : మండలంలోని రబీ, వరి - 2025 సీజన్‌కు గాను అన్ని సొసైటీలు, షాపుల దగ్గర ఎరువుల నిల్వలు రైతుల అవసరం మేరకు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బి.దేవీ స్వరూప అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా సొసైటీలో యూరియా నిల్వలు 71.49 మెట్రిక్ టన్నులు, ప్రయివేటు డీలర్ల దగ్గర 286.47 మెట్రిక్ టన్నులు, మొత్తంగా మండలంలో యూరియా నిల్వలు - 357.96 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. వదంతులు నమ్మి రైతులు ఆందోళన చెందవద్దని, రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందిని కలిసి అవసరం ఉన్న యూరియా తీసుకుని వెళ్లాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం: విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి(ఎపిఇపిడిసిఎల్) శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ కొండయ్య చెరువు పరిధిలో ఉన్న కొండయ్య చెరువు ఏరియా, కడకట్ల, దొమ్మర కాలనీ, ఎల్‌ఐసి ఆఫీస్ ఏరియా, రామారావు పేట, పోస్ట్ ఆఫీస్ రోడ్డు, గొల్లగూడెం సెంటర్ ఏరియాలో విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని పేర్కొన్నారు. ఈ ప్రాంత వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

నరసాపురం: సివిల్ సప్లై గోడౌన్లలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. మండలంలోని సరిపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్ఎం ప్రాంగణంలో ఉన్న గోడౌన్లను విజిలెన్స్ తహశీల్దార్ కన్యాకుమార్, ఎస్‌ఐ సీతారాములు ఆధ్వర్యాన ముందుగా స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఇటు బియ్యం వ్యాపారులు అప్రమత్తమయ్యారు.